
ప్రజాశక్తి
శుక్రవారం 1 ఆగస్టు 2025 5
పార్వతీపురం మన్యం



ధర్నాను జయప్రదం చేయండి : ఫ్యాప్టో

ప్రజాశక్తి-పార్వతీపురం

ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు, పెండింగ్ డిఎ, పిఆర్‌సి సమస్యలపై ఈ నెల 2న మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఫ్యాప్టో నాయకత్వం పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం ధర్నా సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు సుమారు 20 వేల కోట్ల రూపాయలు ఆర్థిక బకాయిలు పడిందని, వీటిని వెంటనే చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. పెండింగ్ ఉన్న మూడు డిఎలను మంజూరు చేయాలని, 12వ పిఆర్‌సి కమిషన్‌ను తక్షణమే నియమించి, ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాల నుండి విముక్తి కలిగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ పి.కూర్మినాయుడు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ రావు, హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు రత్నాకర్ రావు, ఎపిటిఎఫ్ నాయకులు ఎం.స్వామినాయుడు, శాప్ నాయకులు వి.గోవిందనాయుడు పాల్గొన్నారు.

ప్రయివేటు క్లినిక్‌లపై దాడులు

- మందుల దుకాణాల్లోనూ సోదాలు
- బయట పడిన లోపాలు
- అనుమతులు లేకుండా నిర్వహణ

జిల్లా వ్యాప్తంగా ఆర్‌ఎంపి క్లినిక్‌లు, మందుల దుకాణాలపై అధికారులు గురువారం దాడులు చేపట్టారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, డిఎంఅండ్‌హెచ్‌ఒ ఆదేశాల మేరకు రెవెన్యూ, వైద్య, పోలీసు శాఖల అధికారులు విస్తృతంగా సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో అనేక లోపాలు బయటపడ్డాయి. అనుమతులు లేకుండానే క్లినిక్‌లు నిర్వహించడం, గడువు ముగిసిన మందులు విక్రయించడం, అనర్హులతో మందుల షాపులు నడిపించడం వంటి అంశాలు వెలుగు చూశాయి. దీంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు.



సీతానగరం.. మందుల షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు



భామిని.. మందులను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

ప్రజాశక్తి-పాచిపెంట

పాచిపెంటలోని మూడు ఆర్‌ఎంపి క్లినిక్‌లపై తహశీల్దార్ డి.రవి, వైద్యాధికారి సురేష్ చంద్రదేవ్‌తో కూడిన బృందం దాడులు చేపట్టింది. ఆర్‌ఎంపిల లైసెన్సులు, మందులు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ తనిఖీల్లో గుర్తించిన లోపాలను ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని వారు తెలిపారు. లైసెన్సులు లేకుండా వైద్యం చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురంలో నిర్వహిస్తున్న ఆర్‌ఎంపి, పిఎంపి క్లినిక్‌లపై భద్రగిరి సిహెచ్‌సి వైద్యాధికారి అభిలాష్, తహశీల్దార్ శేఖర్, ఎల్విన్‌పేట ఎస్‌ఐ బిడ్డిక శివప్రసాద్ దాడులు చేపట్టారు. క్లినిక్‌ల లైసెన్స్, మందులు నిల్వ, ల్యాబులు, రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించారు. పరిశీలన నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ శివ, సీనియర్ అసిస్టెంట్ ఉదయ్ కుమార్ ఉన్నారు.

కొమరాడ : కొమరాడలోని ప్రయివేట్ క్లినిక్‌లు, మందుల షాపులను రెవెన్యూ, వైద్య, పోలీసు అధికారులు తనిఖీ చేశారు. మెడికల్ షాపులను తనిఖీ చేసిన సమయంలో అవసరమైన అనుమతులు లేకుండానే మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. కొన్ని చోట్ల గడువు తేది లేని మందులను రికవరీ చేసుకున్నారు. అనుమతులు లేకున్నా ఇంజెక్షన్లు, సెలైన్ బాటిళ్లు పెడుతున్నట్టు తనిఖీల్లో గుర్తించారు. తనిఖీల్లో వైద్యాధికారి అరుణ్ కుమార్ నాయుడు, డిప్యూటీ తహశీల్దార్ పకీరు, ఎఎస్‌ఐ రామారావు నాయుడు, విజయ్ పాల్గొన్నారు.

సీతానగరం : సీతానగరం మండల కేంద్రంలో ఆర్‌ఎంపి క్లినిక్‌లు, మందుల షాపుల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. మందుల షాపులో బి-ఫార్మసీ ధ్రువపత్రాలు ఉన్నా.. సంబంధిత వ్యక్తి షాపులో లేనట్లు అధికారులు గుర్తించారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.ఉషారాణి డిప్యూటీ తహశీల్దార్ వి.ఉమామహేశ్వరరావు, ఎస్ వి వెంకటరమణ, పోలీస్ సిబ్బంది, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని భామిని, గరండిలోని మెడికల్ షాపులు, క్లినిక్‌లను తహశీల్దార్ శివన్నారాయణ, బత్తిలి పిహెచ్‌సి వైద్యాధికారి కొండపల్లి రవీంద్ర, భామిని వైద్యాధికారి సోయల్, ఎస్‌ఐ అప్పారావు తనిఖీ చేశారు. నాలుగు క్లినిక్‌లలో తనిఖీ చేయగా ఎవరి వద్ద రిజిస్టర్ సర్టిఫికెట్ లేనట్టు గుర్తించారు. అనుమతులు, సర్టిఫికెట్లు లేకుండా మూడు క్లినికులు, ల్యాబ్, మెడికల్ షాపులు నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. వాటిని సీజ్ చేసి, మందులను స్వాధీనం చేసుకున్నారు.



విరాళాల కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ, జిల్లా నాయకులు

సెప్టెంబర్ 13, 14న

సిఐటియు జిల్లా మహాసభ

ప్రజాశక్తి- పార్వతీపురం

సెప్టెంబర్ 13, 14 తేదీలలో పాలకొండలో సిఐటియు 11వ జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు తెలిపారు. 13న భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్ల రద్దుకు, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, ప్రభుత్వరంగ సంస్థల పరిపరక్షణకు, ప్రభుత్వ పథకాలు, సంస్థలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, రిటైర్మెంట్ సదుపాయాలు కల్పించాలని తదితర సమస్యలపై కార్మికుల పక్షాన నికరంగా నిలబడి ఉద్యమాలను నడుపుతున్న సంఘం సిఐటియు అన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అనేక పోరాటాలను నిర్వహిస్తోందన్నారు. దేశంలో ప్రబలుతున్న మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా, మత సామరస్యాన్ని కాపాడేందుకు, దేశ సమైక్యత కోసం సిఐటియు నికరంగా పోరాడుతోందన్నారు. పెట్రోలియం ఉత్పత్తులు, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని జరుగుతున్న ఆందోళనల్లో అగ్రభాగాన సిఐటియు ఉందని చెప్పారు. మోటారు, భవన నిర్మాణం, రైస్ మిల్లు, ముఠా కళాసీలు తదితర అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై ఉద్యమిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో 11వ జిల్లా మహాసభ పాలకొండలో జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించే బహిరంగ సభలో జిల్లా నలుమూలల నుంచి వచ్చే వేలాదిమంది ఉద్యోగులు, కార్మికులు పాల్గొంటారని, అఖిల భారత, రాష్ట్ర నాయకులు ప్రసంగిస్తారని తెలిపారు. ఈ మహాసభ జయప్రదానికి అందరి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ సందర్భంగా మహాసభ విరాళ కరపత్రాన్ని జిల్లా కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మథరావు, జిల్లా నాయకులు బి.వి.రమణ, ఎన్.వై.నాయుడు, ఎ.శాంతి, జి.జ్యోతి, వి.రామలక్ష్మి పాల్గొన్నారు.

టిడిపి కౌన్సిలర్ల ఆలస్యంపై

చైర్‌పర్సన్ అసహనం

- వాగ్వివాదానికి దిగిన సభ్యులు
- వాకౌట్ చేసి వెనుదిరిగిన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, వైసిపి కౌన్సిలర్లు
- చైర్‌పర్సన్ తీరుపై ఎమ్మెల్యే, టిడిపి కౌన్సిలర్ల అసంతృప్తి



బెల్ కొట్టి లేచివెళ్లిపోతున్న చైర్‌పర్సన్ గౌరీశ్వరి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

సమావేశానికి టిడిపి కౌన్సిలర్లు ఆలస్యంగా రావడం, వాగ్వివాదానికి దిగడంపై మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అసహనం వ్యక్తంచేశారు. ఎజెండాలోని మూడు అంశాల తప్ప మిగతా వాటిని ఆమోదించి, సమావేశాన్ని చైర్‌పర్సన్‌తోపాటు వైసిపి కౌన్సిలర్లు వాకౌట్ చేశారు. చైర్‌పర్సన్ తీరుతో సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర, కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తంచేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. నిర్దేశించిన సమయం కన్నా 45 నిమిషాలు ఆలస్యంగా టిడిపి కౌన్సిలర్లు హాజరయ్యారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే విజయ్ చంద్ర కూడా హాజరయ్యారు. సమావేశం ఆలస్యంగా ప్రారంభం కావడంతో చైర్‌పర్సన్ అసహనం వ్యక్తం చేశారు. దీంతో 24వ వార్డు కౌన్సిలర్ మంత్రి రవి మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ఎప్పుడూ అసహనం వ్యక్తం చేయని చైర్‌పర్సన్ ఇప్పుడు ఇలా చేయడమేమిటని ప్రశ్నించారు. దీంతో ఇద్దరి మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అజెండాలో పొందుపరిచిన 18 అంశాలను మున్సిపల్ ఉద్యోగి చదివి వినిపించారు. నిరాశ్రయుల వసతిగృహ నిర్వహణ బాధ్యతలను 2019 నుంచి 2024 వరకు ఐఆర్‌పిడబ్ల్యు సంస్థకు అప్పగించారని, ఆ సమయం ముగిసిన వెంటనే వేరొకరికి బాధ్యతలు అప్పజెప్పినట్లు గతంలో కౌన్సిల్ ఆమోదం పొందినా మళ్లీ ఎజెండాలో పొందుపరిచారు. మున్సిపల్ కార్యాలయంలో పిహెచ్‌సి, నాన్ పిహెచ్‌సి విభాగాలకు సంబంధించి 23 మంది వర్కర్లను గతేడాది జనవరిలో కౌన్సిల్ ఆమోదంతో నియమించినా నిబంధనలకు విరుద్ధంగా, పక్షపాతంగా నియమించారంటూ వారిని తొలగించాలని రెండో అంశాన్ని పొందుపరిచారు. బెలగాంలో ఉన్న బ్రాంచ్ స్కూల్ ఖాళీ స్థలం లీజు కాల పరిమితి పొడిగించాలని 12వ అంశంగా చేర్చారు. ఎజెండాలోని మూడు అంశాలను వాయిదా వేస్తూ మిగతా 15 అంశాలను చైర్‌పర్సన్ ఆమోదించారు. అనంతరం బెల్‌కొట్టి సమావేశ మందిరం నుంచి వైస్ చైర్మన్లు, వైసిపి కౌన్సిలర్లతోపాటు చైర్‌పర్సన్ వాకౌట్ చేసి వెళ్లిపోయారు.

చైర్‌పర్సన్ తీరు విచారకరం : ఎమ్మెల్యే

మున్సిపల్ సమావేశంలో జవాబుదారీగా ఉండాల్సిన చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి ప్రవర్తించిన తీరు విచారకరమని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర వ్యాఖ్యానించారు. సభ్యులకు నైట్ షెల్టర్ కావాలని స్వయంగా ఆదేశాలు జారీ చేయడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సభ నుంచి వాకౌట్ చేసి వెళ్లిపోయారని, ఇది సభా నియమాలకు వ్యతిరేకమని విమర్శించారు. చైర్‌పర్సన్ గతంలోనూ పలుమార్లు ఇలాగే సభ నుండి వాకౌట్ చేసి వెళ్లిపోయారని తెలిపారు. ఇకనైనా ప్రవర్తన మార్చుకుని ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.



వాకౌట్ చేసి వెళ్లిపోతున్న వైస్ చైర్మన్లు, వైసిపి కౌన్సిలర్లు

మంచం పట్టిన విద్యార్థులు

డోకిశిల ఆశ్రమ పాఠశాలలో జ్వరాల బెడద

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్



జ్వరంతో బాధపడుతున్న విద్యార్థి

మండలంలోని డోకిశిల ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతిగృహ విద్యార్థులు జ్వరాల బారిన పడ్డారు. జ్వరాలు, తలనొప్పి, వాంతులతో సుమారు 25 మంది విద్యార్థులు ఒక్కసారిగా తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో సమీపంలో పిహెచ్‌సికి గురువారం తరలించారు. వైద్యులు ఐశ్వర్య వైద్య పరీక్షలు నిర్వహించి, పలువురు విద్యార్థుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. పాఠశాలలో కేటాయించిన సిక్ రూమ్ మంచాలన్ని అనారోగ్యంతో బాధపడుతున్న గిరిజన విద్యార్థులతో నిండిపోయాయి. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థుల వద్ద ప్రత్యామ్నాయ సహాయకులను గాని, పర్యవేక్షణ అధికారులను గానీ, ఏర్పాట్లు గాని కనిపించకపోవడం విచారకరం. జ్వరంతో మంచాలపై ఉన్న విద్యార్థుల వైపు బాధ్యతగా ఏ ఒక్కరూ చూడడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం తరలించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

3.330 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-పాచిపెంట

పి.కోనవలస ఘాట్‌రోడ్డులో 3.330 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెంకటసురేష్ తెలిపారు. బుధవారం సాయంత్రం పి.కోనవలస ఘాట్ రోడ్డు వద్ద ఒక వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆయన్ను పోలీసులు పట్టుకొని విచారించారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన ఆశిష్ పండిట్‌గా తేలింది. ఆయన వద్దనున్న బ్యాగులో రెండు గంజాయి ప్యాకెట్లు గుర్తించారు. వాటి బరువు 3.330 కిలోలు. దీని విలువ సుమారు 33 వేల రూపాయలు ఉంటుందని నిర్ధారించారు. ఆశిష్‌పై కేసు నమోదు చేసి, గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు పింఛన్లు పంపిణీ

కొత్తగా 1634 మందికి మంజూరు : కలెక్టర్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. జిల్లాలోని 1,40,672 మందికి రూ.60,10,27,500 నిధులను ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు కింద పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఇందులో కొత్తగా మంజూరైన 1,634 మంది వితంతువు పింఛన్లు ఉన్నట్లు చెప్పారు. కొత్తగా మంజూరైన పింఛన్లలో పార్వతీపురం నియోజకవర్గంలో 427, కురుపాంలో 458, సాలూరులో 302, పాలకొండలో 447 ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. మొదటి రోజునే శత శాతం పింఛన్లు పంపిణీకి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు కింద వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, కదలలేని స్థితిలో ఉన్నవారికి, కళాకారులకు తదితర అన్ని రంగాలకు చెందిన వారికి కనీస పింఛను నాలుగు వేల రూపాయలు కాగా, గరిష్టంగా రూ.15 వేలు వరకు అందిస్తున్నట్లు తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించి నివేదికను అందజేయాలని తెలిపారు. ప్రజాభిప్రాయంలో జిల్లా ముందంజలో ఉండేలా అధికారులు కృషి చేయాలని కోరారు.


మండలాల వారీగా పింఛన్ల వివరాలు

మండలం	పింఛన్లు	నగదు
కురుపాం	6,789	28.57 లక్షలు
కొమరాడ	8,297	35.66 లక్షలు
జియ్యమ్మవలస	8,828	38.02 లక్షలు
గుమ్మలక్ష్మీపురం	6,549	27.09 లక్షలు
గరుగుబిల్లి	8,090	34.07 లక్షలు
పార్వతీపురం(అర్బన్)	5,417	23.98 లక్షలు
పార్వతీపురం	10,763	46.14 లక్షలు
సీతానగరం	11,135	47.31 లక్షలు
బలిజిపేట	10,676	45.93 లక్షలు
పాలకొండ (అర్బన్)	3,371	14.56 లక్షలు
పాలకొండ	7,249	30.27 లక్షలు
సీతంపేట	7,961	32.93 లక్షలు
భామిని	6,892	29.80 లక్షలు
వీరఘట్టం	9,707	41.63 లక్షలు
సాలూరు (అర్బన్)	5,680	24.62 లక్షలు
సాలూరు	8,240	35.14 లక్షలు
మక్కువ	8,329	36.68 లక్షలు
పాచిపెంట	6,699	28.54 లక్షలు

'అన్నదాత సుఖీభవ' లబ్ధిదారులు 1,18,377 మంది

ప్రజాశక్తి-పార్వతీపురం

అన్నదాత సుఖీభవ పథకానికి పార్వతీపురం మన్యం జిల్లాలో 1,18,377 మంది రైతులను అర్హులుగా గుర్తించారు. వీరికి ఈ నెల రెండో తేదిన అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ నిధులు జమకానున్నాయని అధికారులు వెల్లడించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎం చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్.దిలీప్ చక్రవర్తి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ ఎం.సుధారాణి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ కె.రామచంద్రరావు, మున్సిపల్ కమిషనర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సిఎంతో వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

సాగునీటి వనరులపై నిర్లక్ష్యం

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ● పణుకు చెరువు గండి పూడ్చిన రైతులు

ప్రజాశక్తి-మక్కువ

సాగునీటి వనరులపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు విమర్శించారు. 29 రోజుల క్రితం మక్కువ మండలం తూరుమామిడిలో పణుకు చెరువుకు పడిన గండిని గురువారం గంగునాయుడు ఆధ్వర్యంలో రైతులు సొంత నిధులు వెచ్చించి పూడ్చారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ వైసిపి ఐదేళ్లలో చేసే అభివృద్ధి ఒక్క సంవత్సరంలోనే చూపిస్తున్నామని టిడిపి కూటమి ప్రభుత్వ నాయకులు ఆర్భాటంగా చెప్పుకుంటున్నారు తప్ప వాస్తవంగా ఎక్కడా ఆ పరిస్థితి లేదన్నారు. 150 ఎకరాలకు సాగు నీరు అందించే చెరువుకు గండి పడితే దాదాపు నెల రోజులైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడమే అందుకు నిదర్శనమన్నారు. ఇరిగేషన్ అధికారులను గండి పూడ్చాలని కోరినప్పటికీ పట్టించుకోలేదని, మీ గండ్లు మీరే పూడ్చుకోవాలని ఉచిత సలహాలివ్వడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు.

గండి పూడ్చినప్పుడు మాత్రం ఇరిగేషన్ అధికారులు తమ సిబ్బందిని పంపించి తమ ఖాతాలో వేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మన్యం జిల్లాలో ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరు వెళ్లే పరిస్థితి లేదని, ఎక్కడా కాలువలకు మరమ్మతులు చేయలేదని, గండ్లు పూడ్చలేదని చెప్పారు. రైతులు ఎక్కడికక్కడ శ్రమదానాలతో కాలువలు బాగు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత సోమవారం అంకలం డ్యామ్ ఆయకట్టు రైతులు పెద్దఎత్తున పార్వతీపురం కలెక్టరేట్‌కొచ్చి ధర్నా చేశారని, అయినా ఇప్పటివరకు వారికి సాగునీరు అందలేదని చెప్పారు. వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న ఈ పణుకు చెరువు గండి కూడా కూటమి ప్రభుత్వం పూడ్చే పరిస్థితి లేదని, దీంతో రైతులే పూడ్చుకోవాల్సి వచ్చిందని తెలిపారు.

వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు పరిధిలో ఇప్పటికే నీరు లేక దమ్ములు సక్రమంగా జరగడం లేదని, ఏటా ఇదే సమయానికి సుమారు 75 శాతం ఉబాలు పూర్తయ్యేవని గుర్తుచేశారు. ఈసారి ఆగస్టు నెల వచ్చినా కూడా వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు నీరు విడిచిపెట్టకపోవడంతో రైతులు దమ్ములు పట్టడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులు చొరవ చూపి, సాగునీటి కాలువలకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్‌చేశారు.



జెసిబితో గండి పూడ్చుతున్న రైతులు

బాబు మోసాలపై ప్రశ్నించాలి
మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన మోసాలపై ప్రజలు ప్రశ్నించాలని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర కోరారు. గురువారం పట్టణంలోని ఏడో వార్డులో ఆయన బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంలో అన్ని వర్గాల ప్రజలను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. సూపర్ సిక్స్ హామీల అమలుపై చెప్పింది ఒకటి చేస్తున్నది మరొకటిలా టిడిపి ప్రభుత్వం వైఖరి ఉందన్నారు. టిడిపి నాయకులను మోసాలపై నిలదీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షులు గిరి రఘు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో బాలభీముడు జననం

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో తొలి కాన్పులో ఎలాంటి శస్త్రచికిత్స లేకుండా 4.2 కిలోల బరువున్న బిడ్డని సాధారణ ప్రసవం ద్వారా బయటకు తీశారు. ఆస్పత్రికి సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ నాగశివజ్యోతి పర్యవేక్షణలో సిబ్బంది పార్వతీపురం మండలానికి చెందిన అక్కపోలు అనిత (26) అనే గర్భిణికి గురువారం సాధారణ ప్రసవం చేశారు. బాలభీముడు లాంటి బిడ్డని సాధారణ ప్రసవం ద్వారా డెలివరీ చేయడం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులకే సాధ్యమవుతుందని డాక్టర్ నాగశివజ్యోతి నిరూపించారు.

చినమేరంగి సిహెచ్‌సిలో
శస్త్రచికిత్సల ద్వారా కాన్పులు

ప్రజాశక్తి -కురుపాం

చినమేరంగి సిహెచ్‌సిలో గురువారం నుండి శస్త్రచికిత్సల డెలివరీలు ప్రారంభమైనట్లు గైనకాలజిస్ట్ డాక్టర్ ధర్మాన పూర్ణచంద్రిక తెలిపారు. చినమేరంగి గ్రామానికి చెందిన బి.హేమలత అనే గర్భిణికి గురువారం శస్త్రచికిత్స ద్వారా కాన్పు చేశారు. వైద్య సిబ్బంది సహకారంతో మొదటి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేశామని ఆమె తెలిపారు. మొదటి సిజేరియన్ విజయవంతంగా నిర్వహించినందుకు డిసిహెచ్‌ఎస్ జి.నాగభూషణరావు వైద్య అధికారులను, వైద్య సిబ్బందిని అభినందించారు.

సీతంపేట వ్యవసాయ పరిశోధన స్థానంలో వర్క్ షాప్

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో పాత పనుకువలస సమీపంలో ఉన్న ఎన్‌జి రంగా వ్యవసాయ పరిశోధన స్థానంలో గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. పార్వతీపురం, పాలకొండ, సీతంపేట, వీరఘట్టం మండలాల నుంచి రైతులు హాజరయ్యారు. రస్తా కుంటుబాయి కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ధ్రువ.. ఎరువులు యాజమాన్య పద్ధతులను వివరించారు.కార్యక్రమంలో శాస్త్రవేత్తలు స్రవంతి, విహారి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

వీరారెడ్డిని కలిసిన జోగారావు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

వైసిపి అనుబంధ విభాగాల శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల ఇన్‌ఛార్జి వీరారెడ్డిని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం రాత్రి పార్వతీపురం వచ్చిన ఆయనను కలిసి, అనుబంధ విభాగాల కమిటీల నియామకంపై చర్చించారు. ఈ సందర్భంగా జోగారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసిపి జిల్లా, మండల స్థాయి అనుబంధ విభాగాల కమిటీల నియామకం ఇప్పటికే పూర్తయిందన్నారు. గ్రామ, వార్డు స్థాయి కమిటీల నియామకం త్వరలోనే పూర్తిచేస్తామని చెప్పారు.

వరుస నాట్లతో తెగుళ్ల నివారణ

ప్రజాశక్తి-పాచిపెంట

వరినాట్లు వేసే ముందు కొసలు తుంచి, వరుస పద్ధతిలో నాటడం వల్ల తెగుళ్లను నివారించవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మూలవలస గ్రామంలో ఆత్మ పర్యవేక్షకులు సూర్యనారాయణ ఆధ్వర్యంలో వరుస వరినాట్లపై నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. వరుసలలో వరి నాట్లు వేయడం వల్ల గాలి, వెలుతురు బాగా సోకుతుందని, దీనివల్ల చీడపీడల ఉధృతి బాగా తగ్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో విఎఎ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిస కావద్దు

ప్రజాశక్తి -కురుపాం

విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా, సక్రమంగా చదువుకొని ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఎస్ఐ పి.నారాయణరావు అన్నారు. గురువారం కురుపాంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్యలోనే విద్యార్థులు సక్రమంగా చదువుకుంటే ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానంలో స్థిరపడవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.గణేష్, వార్డెన్ కె.సూర్యనారాయణ, నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.

గుచ్చిమి పిఎసిఎస్ అధ్యక్షులుగా చిరంజీవి

ప్రజాశక్తి-సీతానగరం



బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్మన్ చిరంజీవి

మండలంలోని గుచ్చిమి పిఎసిఎస్ అధ్యక్షులుగా బూరాడ చిరంజీవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని తెలిపారు. డైరెక్టర్లుగా మరిశర్ల సంజీవ నాయుడు, నాని లక్ష్మణరావు ఎంపికయ్యారు.

20 మందిపై బైండోవర్

ప్రజాశక్తి-సీతంపేట

గతంలో సారా విక్రయించిన 20 మందిపై బైండోవర్ నమోదు చేసినట్లు ఎస్ఐ అమ్మన్నరావు తెలిపారు. ఒక్కొక్కరికి రూ.2 లక్షలు చొప్పున ఇన్‌ఛార్జి తహశీల్దార్ మల్లేశ్వరరావు వద్ద బైండోవర్ చేసినట్లు చెప్పారు. మరోసారి సారా విక్రయిస్తే శాఖా పరమైన కేసులు తప్పవని హెచ్చరించారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనులు చేపట్టడంతో శుక్రవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఇఇ విష్ణుమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేట మండలంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెంకంపేటలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-పార్వతీపురం

మండలంలో వెంకంపేట పంచాయతీ పరిధిలో గురువారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామంలో ఎస్‌సి వీధి, చాకలి వీధి, బిసి కాలనీల్లో కాలువల్లో దోమల ప్రభావం లేకుండా పేరుకుపోయిన పూడికలు తీశారు. మురుగు నీరు నిల్వ లేకుండా చేశారు. ప్రజలు జ్వరాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు సర్పంచ్ తీళ్ళ కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి టి.కిశోర్ పర్యవేక్షణలో పూడికతీత పనులు చేపడుతున్నారు.



కాలువలను శుభ్రం చేస్తున్న కార్మికులు

అధికారులు, సిబ్బందిపై వేధింపులు

కమిషనర్‌పై ఎమ్మెల్యేకు ఫిర్యాదు



ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న మున్సిపల్ కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు నిత్యం వేధింపులకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్రకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది గురువారం ఫిర్యాదుచేశారు. మున్సిపల్ సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యేను కలిసి వినతి అందించారు. అధికారులను, సిబ్బందిని ప్రతిరోజూ వేధింపులకు గురి చేస్తూ అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ఆరోపించారు. మహిళా ఉద్యోగులను చూడకుండా అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని వాపోయారు. అధికారులకు రావలసిన బిల్లుల చెల్లింపులు కావాలన్నా, ఉద్యోగులకు సీట్లు కేటాయించాలన్నా, బదిలీపై వెళ్లే అధికారులకు రిలీవింగ్ లెటర్ ఇవ్వాలన్నా, డబ్బులు ఇవ్వనిదే వారి పనులు చేయడం లేదని తీవ్ర ఆరోపణలు చేశారు. ఉన్నతాధికారులకు, స్థానిక ఎమ్మెల్యేకు ప్రతి నెలా డబ్బులు ఇస్తున్నట్లు బహిరంగంగా చెబుతున్నారని తెలిపారు. కమిషనర్ వేధింపులు తట్టుకోలేక కొందరు అధికారులు బదిలీపై వెళ్లిపోయారని వివరించారు. మరికొందరు అవకాశం లేక ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యాలయంలో ఐదుగురు కంప్యూటర్ ఆపరేటర్లకు గాను ముగ్గురే ఉన్నా, పనిభారంతో అవస్థలు పడుతున్న వారిని కూడా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. కార్యాలయంలో ఉన్న పలు విభాగాల అధికారులకు, గుమస్తాలకు వచ్చిన దరఖాస్తులను ఆయనే స్వయంగా పరిశీలించి దరఖాస్తుదారులను ఇంటికి పిలిపించుకొని వారితో లావాదేవీలు సాగిస్తున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయాలని సంబంధిత అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. ఈ కమిషనర్ దగ్గర తాము విధులు నిర్వహించలేమని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

గిరిజన సంస్కృతికి అద్దంపట్టాలి

ఐటిడిఎ పిఒ అశుతోష్



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ అశుతోష్

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈనెల 9న ఘనంగా నిర్వహించాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. గిరిజన సంస్కృతికి అద్దం పట్టేలా ఈ ఉత్సవాన్ని నిర్వహించాలని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆదివాసీ దినోత్సవ నిర్వహణపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశాన్ని ఆయన ఛాంబరులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ గిరిజన లబ్ధిదారులకు భూపట్టాలు, గృహ పట్టాలు, వ్యవసాయ పనిముట్లు, ఇతర ఉపకారణాలు, ఆర్థిక లబ్దిని చేకూర్చే చెక్కుల పంపిణీ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాంస్కృతిక, ఆర్చరీ పోటీలను నిర్వహించాలని సూచించారు.

ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభించాలని, రైతులకు ఈ విషయాన్ని ముందుగా తెలియజేసి జయప్రదం చేయాలని కోరారు. సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని పక్కాగా అమలుచేయాలన్నారు. గిరిజనాభివృద్ధి కోసం ఆది కర్మయోగి కార్యక్రమం అమలుకానుందని, చిత్తశుద్ధితో ఈ కార్యక్రమాన్ని అమలుచేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో డిఆర్ఒ కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్.దిలీప్ చక్రవర్తి, డ్వామా, డిఆర్‌డిఎ పీడీ కె.రామచంద్రరావు, ఎం.సుధారాణి, ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

3న ఎండిఎం కార్మికుల సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి-సీతానగరం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం నాయకులు

ఈ నెల మూడో తేదిన ఎపి మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా మహాసభ పార్వతీపురంలో జరుగుతుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి వై.శాంతి తెలిపారు. గురువారం సీతానగరంలో ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు, స్కూల్ స్వీపర్ల సదస్సులో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.జ్యోతి, సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణతో కలిసి ఆమె మాట్లాడారు. మండలానికో వంటశాల ఏర్పాటు చేయాలన్నా ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్‌చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, కనీస వేతనం అమలు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. పిఎఫ్, ఇఎస్ఐ వర్తింపజేయాలని, వంటశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్‌చేశారు. ప్రతి నెలా ఐదో తేదీలోపు వేతనాలు చెల్లించాలని, బకాయి వేతనాలు తక్షణమే ఇవ్వాలని, స్కూల్ సీపర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని నిడిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండిఎం కార్మికులు శారద, చిట్టెమ్మ, లక్ష్మి పద్మ, స్కూల్ స్వీపర్లు ఉషా, గౌరమ్మ, తిలోత్తమ పాల్గొన్నారు.

ఎండిఎంకు నిధులు పెంచాలి

సాలూరు రూరల్ : మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ డిమాండ్ చేసింది. గురువారం సాలూరు లయన్స్ క్లబ్ పాఠశాలలో ఎండిఎం కార్మిక సంఘం నాయకులు చొక్కాపు సుశీల, ఎస్ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షులు ఎన్‌వై నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం.శ్రీనివాసరావు మాట్లాడారు. ఎండిఎం కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. పెరుగుతున్న ధరలకు తగినట్టుగా విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంచి చెల్లించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, సామూహిక వంటశాలల నిర్వహణ ద్వారా భోజన పంపిణీ చేయాలనే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్‌చేశారు. అన్ని పాఠశాలలకు వంటగదులు, పనిముట్లు, వర్కర్లకు యూనిఫారం సరఫరాకు ప్రభుత్వమే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు శ్రీదేవి, తవిటమ్మ, పుష్పలత, శోభ, నిర్మల, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ లోడ్ వాహనాలకు జరిమానా

ప్రజాశక్తి-పార్వతీపురం



వాహన తనిఖీలు చేపడుతున్న అధికారులు

ఓవర్ లోడ్ వాహనాలకు అపరాధ రుసుం విధిస్తున్నట్లు జిల్లా రవాణా శాఖాధికారి టి.దుర్గాప్రసాద్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణలో భాగంగా గురువారం సహాయ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టరు బి.కాశీరాం నాయక్. పార్వతీపురం ఆర్‌టిసి డిపో మేనేజర్ దుర్గా, రవాణా శాఖ కానిస్టేబుల్, హోం గార్డులతో సంయుక్తంగా నర్సిపురం వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పరిమితికి మించి అధిక ప్రయాణికులతో ప్రయాణించిన ఆటో రిక్షాలు, రహదారి భద్రతా నియమాలు అతిక్రమించిన 11 వాహనాలపై కేసులు పెట్టారు. 3 వాహనాలను 12 ఆటోలు, 1 లైట్ గూడ్స్ వెహికల్ సీజ్ చేశారు. దాదాపు 30 వేల రూపాయలు అపరాధ రుసుంగా విధించారు. రహదారి ప్రమాదాలపై వివిధ వాహన డ్రైవర్లు, పాదదారులకు అవగాహన కల్పించామని, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని సూచించామని ఆయన తెలిపారు. రహదారి భద్రత నిబంధనలు పాటించడం వల్ల గమ్యాన్ని సురక్షితంగా చేరుకోగలమని ఆయన వివరించారు. వాహనదారులు హెల్మెట్ విధిగా వాడాలని కోరారు. ద్విచక్ర వాహనాన్ని నడిపే వ్యక్తి తప్పని సరిగా ఐఎస్ఐ మార్క్ కలిగిన హెల్మెట్ ధరించాలన్నారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణం చేయరాదని, పరిమితికి మించి అధిక ప్రయాణికులతో వాహనం నడపరాదని ఆయన స్పష్టం చేశారు. స్కూల్ పిల్లలను తీసుకు వెళ్లే బస్సులు, ఆటో డ్రైవర్లు అధికంగా విద్యార్థులను వాహనంలో ఎక్కించరాదని, మద్యం సేవించి వాహనాలను నడపరాదని చెప్పారు.

ఎఎంసి అభివృద్ధికి శ్రీకారం

ప్రజాశక్తి-పాచిపెంట



పాచిపెంట మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ

సాలూరు ఎఎంసి అభివృద్ధికి నూతన చైర్మన్ ముఖి సూర్యనారాయణ శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా శుక్రవారం పాచిపెంట మార్కెట్ యార్డును కార్యదర్శి నరేష్‌కుమార్, ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. పాచిపెంట మార్కెట్ యార్డుకు ప్రహరీ నిర్మాణం, పాత గోడౌన్ మరమ్మతులు, కొత్త గోడౌన్ వినియోగంలోకి తీసుకురావడం, మక్కువ, దుగ్గేరు యార్డుల్లోని గోడౌన్లకు ప్రహరీలు, సాలూరు ఎఎంసి కార్యాలయ ప్రహరీ నిర్మాణాలకు పాలకవర్గం తీర్మానించినట్లు ఆయన తెలిపారు. మంత్రి సంధ్యారాణి సహకారంతో మార్కెట్ కమిటీని అభివృద్ధి చేసి, రైతులకు అండగా నిలుస్తామని చెప్పారు.



నిరసన చేపడుతున్న సిఐటియు నాయకులు, ప్రజలు

స్మార్ట్‌మీటర్లు రద్దుచేయాలని నిరసన

ప్రజాశక్తి-పాచిపెంట

స్మార్ట్ మీటర్లు వెంటనే రద్దు చేయాలని, ఇంతవరకు అమర్చిన మీటర్లను తొలగించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యాన గురువారం పాచిపెంటలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్ల పేరుతో ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని విమర్శించారు. కార్పొరేట్ల లాభాల కోసం స్మార్ట్ మీటర్లు బిగించడం దుర్మార్గమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్ల ఒప్పందం ప్రజలకు ప్రమాదమని కోర్టులో కేసు వేసిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నేడు ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. ఆరోజు స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టండని చెప్పిన మంత్రి నారా లోకేష్ నేడు అదే స్మార్ట్ మీటర్లని పెట్టాలని ఆదేశించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలంతా స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. వెంటనే స్మార్ట్ మీటర్లను రద్దు చేసి, పాత పద్ధతిలోనే మీటర్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువకులు, రైతులు పాల్గొన్నారు

మెప్మా కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్



మెప్మా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న నూతన హంగులతో సుందరీకరించిన మెప్మా జిల్లా కార్యాలయాన్ని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర గురువారం ప్రారంభించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో మాట్లాడి, సంస్థ కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. పట్టణ పేదలకు సహాయ సహకారాలు అందించడంలో మెప్మా ఆర్‌పిలు కీలకపాత్ర పోషించాలని సూచించారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని చెప్పారు. ఏ సమయంలోనైనా తనను కలవవచ్చునని ఆర్‌పిలకు సూచించారు. ఇటీవల ప్రభుత్వం ఆర్‌పిల పదవీకాలంపై మంచి నిర్ణయం తీసుకుందని, ఉద్యోగుల పట్ల ప్రభుత్వ సానుకూల దృక్పథానికి ఇది నిదర్శమని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆర్‌పిలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ జివి చిట్టిరాజు, సాంకేతిక నిపుణులు జి.కిశోర్, మెప్మా సిఎంఎం అంబటి. పుష్ప, సిఒలు పద్మ, ప్రశాంతి, ఈశ్వరరావు, టిఎల్ఎఫ్ శ్రీదేవి, కంప్యూటర్ ఆపరేటర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త ఆశలకు మంత్రి గండి!

ప్రజాశక్తి-సాలూరు

మండలంలోని తోణాం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త నపిరి సుజాత ఆశలకు మంత్రి సంధ్యారాణి గండి కొట్టే ప్రయత్నంలో ఉన్నట్టు తెలుస్తోంది. తోణాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నాలుగు ఆశావర్కర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించారు. వీటిలో తోణాం ఆశావర్కర్ పోస్టుకి డిమాండ్ ఏర్పడింది. గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త నపిరి సుజాత భర్తని కోల్పోయింది. ఆమెకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. నిరుపేద వితంతువు సుజాతకి ఏదైనా ఉద్యోగం విషయంలో సహకరిస్తామని పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. ఆ ఆశతో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న సుజాత ఆశావర్కర్ పోస్టుకి దరఖాస్తు చేసింది. ఈ పోస్టు తనకి ఇప్పించాలని సుజాత మంత్రి సంధ్యారాణిని కోరగా ఆమె కూడా హామీ ఇచ్చారు. అయితే ఇప్పుడు స్థానిక టిడిపి నాయకులు సిఫార్సు చేస్తున్న గుమ్మడి పద్మకి ఇవ్వాలని మంత్రి సంధ్యారాణి సిఫార్సు చేస్తున్నారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుజాత జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. తాను వితంతువని, ఆశావర్కర్ పోస్టు నియామకంలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ పోస్టుని స్థానిక టిడిపి నాయకులు ప్రభుత్వ ఉద్యోగి భార్య అయిన గుమ్మిడి పద్మ నుంచి లంచం తీసుకుని సిఫార్సు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనకు న్యాయం చేయాలని సుజాత.. టిడిపి నాయకులను ప్రాధేయపడుతున్నా ఫలితం కనిపించడం లేదు. దీనిపై సుజాత మాట్లాడుతూ టిడిపి కార్యకర్తగా తనకు పార్టీ నాయకులు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



డ్రోన్‌ను ద్వారా పిచికారిని పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్

డ్రోన్‌తో యాంటీ లార్వా ఆపరేషన్

ప్రజాశక్తి-సీతంపేట

యాంటీ లార్వా ఆపరేషన్ ద్వారా దోమ పిల్లలను చంపే కార్యక్రమాన్ని డ్రోన్ సహాయంతో చేపట్టారు. పెద్దూరు, నౌగూడలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిచికారీతో దోమపిల్లలు వృద్ధి చెందవని చెప్పారు. పైలట్ ప్రాజెక్టు కింద పెద్దూరు, నౌగూడ గ్రామాల్లో చెరువులలో డైఫ్లోరో బెంజిరాన్ అనే ఐజిఆర్‌తో పిచికారి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిఎంఒ పివి సత్య నారాయణ, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతి, మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్, సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-పార్వతీపురం

పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో గురువారం ఆశా సమస్యల పరిష్కార వేదికను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. ప్రతీ పిహెచ్‌సి నుండి ఒక ఆశా కార్యకర్త ప్రతినిధిగా హాజరయ్యారు. వారి సమస్యలను గ్రీవెన్స్‌లో ప్రస్తావించి ఫిర్యాదులను డిఎంహెచ్ఒకు అందజేశారు. వీటిలో ప్రధానంగా వారి విధి విధానాలకు సంబంధించి ఆశ జాబ్‌చార్ట్ మేరకు విధులు అమలయ్యేలా ఉండాలని పలు సమస్యలను నివేదించారు.

గ్రీవెన్స్‌లో అందజేసిన ఫిర్యాదులను పరిశీలించి తగు పరిష్కారం చూపుతామని డిఎంహెచ్ఒ తెలిపారు. ప్రతీ ఆశా కార్యకర్తకు గుర్తింపు కార్డు ఉండేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి టి.జగన్ మోహనరావు, ఎపిడిమియాలజిస్ట్ కౌశిక్, డిపిహెచ్‌ఎన్ఒ ఉషారాణి, డిసిఎం విజయలత, హెచ్ఇ విజయలక్ష్మి , సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

ప్రజాశక్తి -కురుపాం, భామిని



మృతిచెందిన ఎల్లంగు



బోల్తాపడిన ఆటో

భామిని మండలం బంద్రసింగి ఘాట్ రోడ్డులో గురువారం ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. కురుపాం మండలం ఆవిరి గ్రామానికి చెందిన ఏడుగురు ఆటోలో భామినిలో గురువారం జరిగే వారపు సంతకు వెళుతున్నారు. బంద్రసింగి ఘాట్ రోడ్డులో ఆటో బోల్తాపడటంతో కొండగొర్రి ఎల్లంగు (52) అనే వ్యక్తి మృతి చెందారు. తీవ్ర గాయాలైన వారికి సీతంపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.